# 12. ఒక స్వప్నం - ఒక మెలకువ

రాత్రి శ్యామలకి ఎంత ప్రయత్నించినా నిద్ర రావడంలేదు. కనురెప్పలు పొడిబారి ఇసక పడినట్టు కళ్లు గరగరలాడుతున్నై. ఇటు నుంచి అటు, అటునుంచి ఇటు చాపమీద పొర్లుతూనే ఉంది.

'ఎంత బావుంది ఇల్లు!' నూట పదహారోసారి అనుకుంది. రెండు బెడ్‌రూములు, పెద్దహాలు, అందంగా అమర్చినట్టున్న వంటగది. ఆ నేలను చూస్తే అడుగులు ఆన్చి నడవబుద్ధి కాలేదు. పాదం మోపితే మాసిపోతుందన్పించే తెల్లని పాల రాతి నేల. ఇంట్లో ఎక్కడ కావాలన్నా విప్పితే నీళ్ళొచ్చే కుళాయిలు, ఓహ్, బతికితే అలాంటి ఇంట్లో బతకాలి. ఇల్లు కాదు, దాన్ని ఫ్లాట్ అనాలట.

వెల్లకిలా తిరిగి నుదుటిమీద మోచెయ్యి ఆన్చుకుంది. పైన పగిలిన పెంకుల్లోంచి సన్నని వెన్నెల చార, ఎప్పుడూ అందంగా కన్పించే వెన్నెల చారను చూస్తే ఈ రోజు కోపం ముంచుకొచ్చింది. వెన్నెలా.. గిన్నెలా.. ఛా, వెధవ బతుకు. వంటింట్లో ఇంకా పెద్ద వెన్నెల చారలొస్తాయ్ శుక్లపక్షంలో. వర్షంవస్తే అసలు బండారం బైటపడుతుంది. పెంకుల చిల్లుల్లోంచి నీళ్లు జాలరుకట్టేసి, ఉన్న రెండు గదులూ తడిసిపోయి, గిన్నెలూ బకెట్లూ నిండుతూంటే పారబోస్తూ... రాత్రంతా జాగరణ...

'ఎంత బావుంది ఆ ఇల్లు!' - నూట పదిహేడోసారి. అలాంటి ఇల్లు సునీతకెందుకు నచ్చలేదో! సునీత అలా అనగానే తను షాక్ తిన్నట్టు చూసింది.

"ఆ... ఏం ఫ్లాట్‌లెద్దూ, అంతా చీప్ క్వాలిటీ మెటీరియల్, ఆ స్విచ్చులు, స్విచ్‌బోర్డులు, టేప్స్ అన్నీ చవక రకంవి వాడేసి, రెంట్ మాత్రం మూడువేలట. ఎవడిక్కావాలి బోడి ఫ్లాట్" అంది.

సునీత శ్యామల దగ్గరికి చీరలమీద వర్క్ చేయించుకోడానికి వస్తోందీ మధ్యనే. వాళ్ళాయనకేదో చాలా ఆదాయం వచ్చే వ్యాపారం ఉంది. త్వరలోనే మంచి ఇల్లు కట్టుకుంటారట. ఈలోగా, ఉంటున్న ఇల్లు కొంత పాతబడిందని కొత్త ఇంటికోసం

వెతుకుతోంది. శ్యామలని సాయం తీసుకెళ్ళింది. సునీత మాటేమోగాని, శ్యామల మనసంతా ఆ ఇంట్లోనే ఉండిపోయింది.

తనకి ఫేమిలీపెన్షను మూడు వేలు వస్తోంది. భర్త బతికి ఉన్నప్పుడు చాలా పొదుపు చేసి, తినీ తినకా డబ్బు కూడబెట్టి ఈ రెండు గదుల పాత పెంకుటిల్లు కొనుక్కున్నారు. ముందు పడకగది, వెనక వంటగది. ఏనాడూ ఎలాంటి లగ్జరీలూ కోరుకోలేదు. ఆశపడి పరుగులెత్తలేదు.

ఉన్న ఒక్క పిల్లనూ డిగ్రీ చదివించి, ఉన్నదంతా ఊడ్చి పెళ్లి చేసేసింది. ఇంటికి అద్దె లేదు కాబట్టి గుప్పెడు బియ్యం వండుకుతిని గడిపేస్తోంది. చీరల మీద వర్క్ చెయ్యడం - ఎప్పుడో సరదాగా నేర్చుకున్నది, ఇప్పుడు అక్కరకొస్తోంది. నెలనెలా కొద్దో గొప్పో ఆదాయం తెచ్చిపెడుతోంది. తనకింకేం బాదరబందీలు లేవు. పెన్షను మూడు వేలూ ఖర్చైపోతే ఏం పోయింది! కోరుకున్న, మనసుకు నచ్చిన మంచి ఇంట్లో ఉండడం ఈ జన్మకు సార్థకతే కదా!

కుడిపక్కకు వొత్తిగిల్లి చెంపకింద చెయ్యి పెట్టుకుంది. గోడమీద బల్లి ఒకటి పురుగుల్ని వేటాడుతోంది. ఏమైనా సరే, ఉదయాన్నే సునీతనడిగి ఆ ఇంటి వోనరు ఫోన్ నెంబరు తీసుకోవాలి. పక్కనే ఉన్న కాయిన్ ఫోన్ నుంచి మాట్లాడితేసరి! ఒక్క రూపాయి కావచ్చు, లేదా రెండు. "ఛా... అంతమంచి ఇంట్లో ఉండబోతూ ఈ చిల్లర రూపాయల లెక్కలేంటి?

శ్యామల ఎడం పక్కకి తిరిగి చెంపకింద రెండు చేతుల్నీ చేర్చి ఆలోచిస్తోంది. చాలా ఉద్వేగంగా ఉంది.

ఏమైనా సరే, ఈనిర్ణయం మార్చుకోకూడదు. కోరినట్టు బతకాలంటే ఎలాగూ సాధ్యంకాదు, కోరుకున్న ఇంట్లో బతకడం సాధ్యం చేసుకోవాలి. తప్పదు - సునీత పొద్దుటే వస్తానంది. మరికొన్ని ఇళ్లు చూడాలట.

"ఆవిడ ఎన్ని ఇళ్లైనా చూసుకోనీ, నాకు మాత్రం ఆ ఇల్లే చాలా నచ్చింది" అనుకుంది.

సునీత కారులోంచి ఎంత ఠీవిగా దిగుతుందో గుర్తొచ్చింది. తెల్లగా, బొద్దుగా ఉండే సునీతతో పోల్చుకుంటే తనే నాజూగ్గా ఉంటుంది. ఉండకేం చేస్తుంది. రోజంతా పనిలో సతమతమౌతూంటే... ఓ పక్క టైలరింగ్, మరోపక్క చీరల ఫేన్సీ వర్కు.

ఆ 'నందనా' షాపతను "మీ చేతిలో మంచి ఆర్ట్ ఉందండీ". అంటూంటాడు. ఎప్పుడూ గేప్ లేకుండా వర్క్ ఇస్తూనే ఉంటాడు. ఆ షాపులో చీరలు కొనుక్కోడానికి వెళ్లి, సునీత తన గురించి తెలుసుకుని వస్తోంది. కారులో తిప్పుతుంది సరే గాని, తన టైం ఎంత వేస్టవుతుందో ఆలోచించదు. అక్కడి కెళ్దాం, ఇక్కడికెళ్దాం అని వెంట తీసుకెళ్తూంటుంది.

ఈ రోజు వంగపండు రంగు మీద తెల్ల చుక్కలున్న వాయిలు చీర కట్టుకున్న తనని అట్టే చూసి చూసి "మీకు నలభై ఏళ్ళంటే ఎవరూ నమ్మరు శ్యామలా" అంది. "మీ అమ్మాయికి అక్కలా ఉంటారు" అని కూడా అంది.

ఎలాగూ కార్లూ, షికార్లూ తనలాంటివాళ్ళకి సాధ్యమయ్యేవి కావు. మనసుకి నచ్చిన ఇంట్లో జీవించాలనే కోరిక కూడా తీర్చుకోకపోతే ఎలా? ఈ జీవితానికి సార్థకత ఏముంది? మళ్ళీ వెల్లకిలా తిరిగింది. ఒకటే అలజడి - పై నుంచి వెన్నెల జాలరు మాయమైంది. కళ్ళమండడం ఎక్కువైంది.

కళ్ళమీదికి నిద్రను తెచ్చుకోవాలని రెప్పలు గట్టిగా మూసుకుంది. ఏ విషయం మీదికీ మనసుని పోనివ్వద్దు అనుకుంది. ఆలోచనలన్నిటీనీ కట్టకట్టి బైటికి విసిరేయాలనుకుంది.

ఒంటి గంటో, రెండో దాటి ఉంటుంది. ఇంక నిద్రపోకపోతే తెల్లారి ఏ పని చెయ్యాలన్నా బద్ధకంగా, నీరసంగా ఉంటుంది. ఒకటి... రెండు... మూడు...

అంకెలు లెక్కపెట్టడం మొదలుపెట్టింది. మనసుకి ఏకాగ్రత కుదరడంలేదు. కళ్ళు మూసినా తెరిచినా ఆ కొత్త ఇల్లే కన్పిస్తోంది.

వీధి గుమ్మానికి అమర్చిన టేకు చెక్క తలుపు ఎంత బావుందో! కాని అద్దెకొంచెం తగ్గితే బావుండును. "ఇది చిన్న పట్టణం కాబట్టి మూడువేలు, ఇదే హైద్రాబాదైతే పదిహేను వేలుంటుంది తెల్సా" అంది సునీత.

"అయ్య బాబోయ్, పదిహేను వేలే? ఆ లెక్కన ఆ ఇంట్లో ఉండాలనుకునే వాళ్ళకి జీతం ఎంతుండాలి?" అనుకుంది శ్యామల. ఎక్కడో దూరంగా ఉరుముతోంది.

"మబ్బు కమ్ముకొస్తోందేమో" అనుకుంది.

అలజడి... ఉద్వేగం...

తలగడ పక్కకి నెట్టేసి బోర్లా పడుకుంది. చేతులు ముందుకు చాపి సాష్టాంగ విధానంలో ధ్యానం మొదలుపెట్టింది. ఆలోచనల ఒరవడిలో ఎప్పుడు తిరిగిందో కాస్సేపటి తర్వాత వెల్లకిలా పడుకొని పైకప్పును తదేకంగా చూస్తోంది. ఇక లాభం లేదని లేచి కూర్చుంది.

లైటు వేసుకుని కుట్టు పని ఏదైనా చేద్దామా అనుకునేసరికి అప్పటివరకూ వెలుగుతున్న బెడ్‌లైటు టప్పున ఆరిపోయింది.

'కరెంటు పోయింది, హతోస్మి' అనుకుంది.

'కాస్త వానొచ్చే సూచన కన్పిస్తే చాలు ముందుగా పవర్ కట్ చేసేస్తారు' అని చికాకుపడింది.

చీకట్లో తడుముకుంటూ వంటింట్లో కెళ్ళి, కుండలోంచి గ్లాసు నీళ్లు ముంచుకుని తాగి, మరో గ్లాసు నీళ్లుమండుతున్న కళ్లమీద చల్లుకుంది. కొంగుతో తుడుచుకుని, తడి కొంగును కళ్లమీద కప్పుకొని పడుకుంది.

ఎక్కడో కోడి ఒకటి కొక్కొరోకో అంటున్న వేళ రెప్పల మీదికి సన్నని నిద్ర కమ్ముకువచ్చింది.

పగలు –

తెల్లని వెలుగు కిటికీ లోంచి వచ్చి శ్యామల మొహాన్ని తడుముతోంది. వెలుగు కిరణాల్లో వేడి ప్రవేశించగానే ఉలిక్కిపడి మెలకువొచ్చింది శ్యామలకి.

"పనీ పాటూ లేనిదాన్లా ఇలా నిద్రపోయానేంటి!" అనుకుంటూ లేచింది.

వాకిట్లో కళ్లాపి జల్లి, ముగ్గుపెట్టి వెనక్కి తిరిగింది.

ఆ చిన్న ఇల్లు ఆత్మీయ బంధువులా కన్పించింది. రాత్రి తను కన్నకలలు, అలజడి గుర్తుకొచ్చి మళ్లీ మనసంతా బరువెక్కింది.

సునీత ఇవాళ ఇంకా కొన్ని ఇళ్లు చూడాలంది. ఆ విషయం గుర్తుకొచ్చి గబగబా రెడీ అయింది. కారులో తిరగడం గమ్మత్తుగా ఉంది. చాలా బావుంది. తనలోనూ ఏదో తెలీని తీవి ప్రవేశించినట్టుంది. మరో నాలుగు మంచి మంచి ఇళ్లు చూసారు.

శ్యామల నిన్న గమనించని ఓ కొత్త విషయం ఈ రోజు గమనించింది. ఈ ఫ్లాట్స్ అనబడే వాటికి రెంట్ కాక వేరుగా మెయింట్‌నెన్స్ ఛార్జెస్ ఒకటుంటాయని.

తిరిగొచ్చేటప్పుడు 'కాఫీ తాగి వెళ్దువుగాని' అంటూ సునీత శ్యామలని వాళ్ళింటికి తీసుకెళ్లింది.

ఆ ఇంట్లోని ఫర్నీచర్, రిచ్‌నెస్ చూసి శ్యామల కళ్లు ఆర్పలేకపోయింది.

'కాఫీ తెచ్చిచ్చిన పనమ్మాయి లక్ష్మికూడా నాకన్నా వంద రెట్లు దర్పంగా ఉంది' అనుకుంది.

"ఇవాళ చూసిన వాటిల్లో రెంట్ ఎక్కువైనా ఆ త్రీ బెడ్ రూం ఫ్లాట్ బావుంది కదా శ్యామలగారూ" అంది సునీత. శ్యామల ఏదో చెప్పబోయేలోగా "అవును కరెక్ట్. అదైతే ఇపుడు మేం కట్టబోయే ఇంటికి కొంత దగ్గరగా ఉంటుంది కూడా" అంది.

ఎదురింటి వనజ వచ్చింది. సునీత ఆవిడతో మాటల్లో పడింది.

"బంగారం ధర దిగిందట కొనడానికెళ్దామా" అంటోంది.

"కనిష్క కెళ్దాం, రేటెక్కువైనా మంచి మోడల్సుంటాయ్" అంది సునీత. ఉన్నట్టుండి ఏదో గుర్తుకొచ్చి చుట్టూ చూస్తూ "కొత్తింట్లోకి ఈ ఫర్నిచరు అస్సలు బాగోదు. కొని అయిదేళ్లైపోయింది. ఇవన్నీ మార్చెయ్యాలి. ఇంటికి తగిన ఫర్నిచరు లేకపోతే చూసిన వాళ్లు నవ్వుకుంటారు. ఏవంటావ్ వనజా! మీకు తెల్సిన వాళ్ళెవరైనా ఉంటే చెప్పు. ఇవన్నీ అమ్మేద్దాం. ఓ యాభై వేలొచ్చినా వచ్చినట్టే కదా! టీవీతో సహా అన్నీ కొత్తవి కొనడానికి అయిదు లక్షలుపైనే కావచ్చు" సాలోచనగా అంటోంది సునీత.

"యాభై వేలు... అయిదు లక్షలు" అనే మాటలు తప్ప మరేం విన్పించలేదు శ్యామల చెవికి. తాగుతున్న కాఫీ పొలమారి నెత్తిమీద అరచేత్తో చరచుకుంది.

"డ్రైవరు ఏదో పనిమీద బైటికెళ్ళేడు, ఆటోలో వెళ్తారా శ్యామలా ఇంటికి" అంది సునీత.

"ఫర్వాలేదు ఫర్వాలేదు, నేను వెళ్తాను" అని ఆ ఇంట్లోంచి బైటపడింది శ్యామల.

రోడ్డుపక్కనే కాళ్లీడ్చుకుంటూ నడుస్తోంది.

మనసు, మెదడు చాలా బ్లేంక్‌గా అయిపోయాయి.

రోడ్డుపక్క ప్రైవేటు స్కూలు విడిచిపెట్టేరు. పిల్లల్తో బాటు బైటికొచ్చిన టీచర్లిద్దరు తన పక్కనే నడుస్తూ మాట్లాడుకుంటున్న సంభాషణ వద్దన్నా శ్యామల చెవిలో పడుతోంది.

"బియ్యం ధర బస్తా మూడు వేలు దాటిపోయిందట తెల్సా?"

"రోజూ కడుపులోకెళ్లాల్సిన బియ్యం, కూరగాయలు ఆకాశాన్నంటుతూంటే ఏంకొనేలా లేదు. ఏం తినేలా లేదు అని పాడుకోవాలన్పిస్తోంది.

ఒక కడుపు నొచ్చినా, కాలు నొచ్చినా అవసరానికి నాలుగు రూపాయలు దాచుకునే పరిస్థితి లేదు".

'అవును కదా, డబ్బుతో ఎప్పుడేం అవసరం వస్తుందో చెప్పలేం కదా' అనుకుంది శ్యామల.

వీధి మలుపులోకొచ్చాక దూరం నుంచి తన ఇంటిని చూసుకుంది. దగ్గర దగ్గరగా కిక్కిరిసిన ఇళ్లమధ్యనుంచి ఆప్యాయంగా తనని ఆహ్వానిస్తోంది.

మెట్టుపైకెక్కి రంగువెలసిన తలుపుని ఆత్మీయంగా నిమిరింది.

తాళం తీసి లోపలికెళ్లి చాపమీద చతికిలబడి, అచ్చం సునీత లాగా మొహం పెట్టి సాలోచనగా చూసింది.

ఆమూల పాత టేబులుమీద ఇక్ష్వాకుల కాలంనాటి బ్లాకెండ్ వైట్ పోర్టబుల్ టీవీ, మరోమూల కుట్టుమిషను, కాలు విరిగిన కుర్చీ కన్పించాయి.

'ఇంటికి తగిన ఫర్నిచరు' అన్నమాట గుర్తుకొచ్చి నవ్వొచ్చింది. చాపను చేత్తో నిమురుతూంటే రాత్రి దానిపైన పడుకొని కన్న కలలు, చేసిన ఆలోచనలు, ఫీలైన ఉద్వేగం గుర్తుకొచ్చాయి.

"ఛీ... ఫూల్" అని నెత్తిమీద మొట్టికాయ వేసుకుని వంటచేసుకోవడానికి లేచింది. ఎప్పట్లా కూనిరాగం తీసుకుంటూ వంట పూర్తిచేసి, తిని చాపమీద నడుం వాల్చింది. క్షణంలో వొళ్లెరగని హాయి నిద్రలోకి జారుకుంది శ్యామల.

*(15-8-2009 ఆంధ్రభూమి డైలీ)*